పార్టీలెన్ని జతకట్టినా జగన్ వెంటే జనం

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే గుంతకల్లు అభివృద్ధి
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి రాజకీయ పార్టీలన్నీ జతకట్టినా ప్రజలందరి చల్లని దీవెనలతో మళ్లీ వైఎస్సార్‌సీపీనే విజయదుందుభి మోగించనుందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 21, 23, 24 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడిగా సీఎం జగన్ దేశచరిత్రలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి మేలు చేసిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాలన్నా, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పని చేయాలన్నా మళ్లీ జగనన్నకే పట్టం కట్టాలన్నారు. జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరించి ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మైమూన్, మాజీ చైర్మన్ రామలింగప్ప, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు సంపత్ ఆచారి, జమీల్, మాజీ కౌన్సిలర్ పోలేపల్లి మధు, కౌన్సిలర్ మెహరున్నీసా, మైనార్టీ నాయకులు ఖుద్దాముల్ రఫీక్, గఫార్, ఖలీఫా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే గుంతకల్లు అభివృద్ధి

గుంతకల్లు నియోజకవర్గ చరిత్రలో గతంలో పాలించిన ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి కార్యక్రమాలు తన హయాంలో జరిగాయని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానని ఎమ్మెల్యే వైవీఆర్ అన్నారు. వంద పడకల గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయించడంతో పాటు బ్లడ్‌బ్యాంక్, వైఎస్సార్ హెల్త్‌సెంటర్లు, డయాలసిస్ కేంద్రం, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయించామన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు, ధర్మవరం రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి, దోనిముక్కల రోడ్డు, గుత్తి, పామిడి పీఎస్‌లను ఎస్‌డీపీఓ పరిధిలోకి విలీనం, పామిడి మున్సిపాలిటీని మేజర్ పంచాయతీగా మార్పు చేయించడంతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి చూపిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. గుంతకల్లు పట్టణ పరిసరాల్లో రూ.1,000 కోట్లతో సోలార్ గ్రిడ్ ఏర్పాటు కానుందని, తద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో చిన్న ఘర్షణలకు కూడా తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జనరంజకపాలన సాగించిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే వైవీఆర్ ప్రజల్ని అభ్యర్థించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



దంతలపల్లిలో ప్రచారం చేస్తున్న శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు



నీర్జాంపల్లిలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వీరాంజనేయులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

యల్లనూరు: నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలిచి 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం చేసుకుందామని శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు ఓటర్లను కోరారు. గురువారం మన ఊరు మన వీరా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీర్జాంపల్లి, దంతలపల్లి, లక్ష్మంపల్లి, గడ్డంవారిపల్లి, లింగారెడ్డిపల్లి, మల్లాగుండ్ల గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. వీరాంజనేయులు మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తు ఓట్లు వేసి ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మించడం వల్ల గ్రామస్థాయిలోనే మెరుగైన సేవలు అందుతున్నాయని, జగనన్నకే మా ఓటు అని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంనాయుడు, నాయకులు పసుపులేటి పద్మావతమ్మ, గడ్డంవారిపల్లి రామకృష్ణారెడ్డి, రామాంజనేయరెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, దంతలపల్లి విజయ భాస్కర్‌రెడ్డి, బాలవెంకటరెడ్డి, శివనాగిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, రాజేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చింతకాయమంద సందీప్‌రాయల్, వెంకటాంపల్లి శంకర్‌రెడ్డి, నీర్జాంపల్లి లక్ష్మన్న, వెంగళరాయుడు, పెద్దిరాజు, కొట్టాల వెంగప్ప, యల్లనూరు మూర్తి, చేటప్ప తదితరులు పాల్గొన్నారు.

నీర్జాంపల్లిలో మొగ్గం నేస్తూ..

నీర్జాంపల్లిలో ఓ చేనేత ఇంట్లో ఎం.వీరాంజనేయులు మగ్గం నేస్తూ కాసేపు ముచ్చటించారు. శింగవరం వద్ద వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. చంద్రబాబు మాయ మాటలను నమ్మొద్దన్నారు. మంది కూలీలతో అభివృద్ధి బాగా జరిగింటే జగన్‌కు ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, సీఎంగా జగనన్నను గెలిపిస్తే చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు.



పల్లె నిద్రలో భాగంగా గడ్డంవారిపల్లిలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

గడ్డంవారిపల్లి పల్లె నిద్ర

ప్రచారం అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు గడ్డంవారిపల్లిలోని ఎస్సీ కాలనీలో ఉన్న రామాలయంలో గురువారం రాత్రి పల్లె నిద్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. సీఎం జగన్ వరుసగా నాలుగేళ్లు డ్వాక్రా మహిళలకు ఆసరా నిధులు విడుదల చేశారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



మహిళలను ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిరూరల్/యాడికి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 36వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నవరత్నాల పథకాల కరపత్రాలను ప్రజలకు అందచేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అలాగే తాడిపత్రి ప్రశాంతంగా ఉండాలంటే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత తదితరులున్నారు.

- యాడికి మండలంలోని చందన గ్రామంలో గురువారం కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం చేశారు. గత నలభై ఏళ్లలో చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఐదేళ్లలో చేసి చూపించారన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాగుల పార్వతి, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు బాలా రమేష్‌బాబు, భోగతి బ్రహ్మానందరెడ్డి, ఆదిరంగారెడ్డి, వెంకటరామిరెడ్డి, శివకేశవ రెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వ్యయంపై సూక్ష్మ స్థాయిలో నిఘా



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

గుంతకల్లు: అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార వ్యయంపై సూక్ష్మ స్థాయి నిఘా ఉంటుదని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వినియోగించే వాహనాలు తదితర వాటిపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన ధర ప్రకారం లెక్కగడతామన్నారు. సీ- విజిల్ యాప్ ద్వారా అందిన ఆరు ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించామన్నారు. ఎంసీసీలో భాగంగా అన్ని పార్టీలకు సంబంధించిన బోర్డింగ్‌లను తొలగించామన్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుగా చేసుకోవచ్చన్నారు. ఎన్నికల నియామావళి ఉల్లంఘించిన నలుగురు వలంటీర్లను సస్పెండ్ చేశామన్నారు. వలంటీర్లు, రేషన్ డీలర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనట్లు రుజువయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 12, 13వ తేదీల్లో అనంతపురంలోని జేఎన్‌టీయూలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శేష ఫణి, భారతి, చంద్రమోహన్‌నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నయక్కలూరులో గురువారం సాయంత్రం స్థానిక నేతలు ఓబిరెడ్డి, నారాయణప్ప ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, చింతా రామక్రిష్టారెడ్డి, బత్త భాస్కర్‌రెడ్డి, నాగూర్ అశ్వర్థరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పాలనమెచ్చి తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెకరట్రీ రవిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, కోప్షన్ సభ్యుడు హాజీవలి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, తురకపల్లి శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, చాగల్లు సూరి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన గ్రామంలో ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామన్నారు. అలాగే ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలన్నారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త!



బుక్కరాయసముద్రం: మండే ఎండల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మి సూచించారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఆమె పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 39-41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారం. ప్రజలు సాధ్యమైనంత వరకు కొబ్బరి నీరు తీసుకోవాలి.

ఎండలో పని చేస్తే..

ప్రజలు వేసవి కాలంలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లు నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడ దెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

వేసవిలో చేయకూడనివి

- మండు వేసవిలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం సేవించరాదు.
- రోడ్లు మీద చల్లని రంగు పానీయాలు తాగరాదు.
- రోడ్లపై విక్రయించే కలుషిత ఆహారం తినరాదు
- వేసవిలో మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేపిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తిన కూడదు.

వేసవిలో చేయవలసిన పనులు

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి
- రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి
- ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలి

వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేనిపక్షంలో గ్లూకోజు, ద్రావణం త్రాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.

ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 9 నుంచి 11వ తేదీ వరకూ ఉగాది ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో వివిధ శాఖల అధికారులతో ఈఓ భద్రాజీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ జోక్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉత్సవాలు జరుగనున్న మూడు రోజులు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన లారీ



డ్రైనేజీలోకి దిగబడిన లారీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మాతృశ్రీ ఆస్పత్రి సమీపంలో గురువారం ఓ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. అయితే ఎవరికీ ఏం కాలేదు. డ్రైవర్ లారీని రివర్స్ చేస్తున్న సమయంలో రోడ్డు పక్కనున్న డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. ప్రమాదం తప్పడంతో డ్రైవర్, క్లీనర్ ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జాన్సన్

తాడిపత్రిటౌన్: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని క్రిష్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ జాన్సన్ కోరారు. పట్టణంలోని ఆర్టీటీ కాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలిచిన తర్వాత తాడిపత్రిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్, ప్రతాప్, జాషువా, వినోద్, బింగి ప్రసాద్, రాయప్ప, సురేష్, విజయ్‌కుమార్, నరేంద్ర, మనోకర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఏకగ్రీవం

గుత్తి: గుత్తి బార్ అసోసియేషన్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షుడిగా పి. దేవరత్నం, ప్రధాన కార్యదర్శిగా నగదాని చంద్రశేఖర్, కార్యదర్శిగా పి. నవీన్, కోశాధికారిగా వీసీ గంగాధర్, లైబ్రరీ సెక్రటరీగా కె.వెంకటేసులు, స్పోర్ట్స్ సెక్రటరీగా రోజా రమణి, లేడీ రిప్రజెంటేటివ్‌గా శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి

పుట్లూరు: ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ మల్లికార్జునస్వామి సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభలు, ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. కోడ్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఎంపీడీఓ దస్తగిరి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఆర్‌ఐ క్రిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, క్రిష్టవేణి, సర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కేశవ పిళ్లైకు నివాళి



కేశవ పిళ్లై చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కేశవ పిళ్లై ఉన్నత పాఠశాలలో గురువారం స్వాతంత్య్ర సమర యోధుడు కేశవ పిళ్లై వర్ధంతి కార్యక్రమాన్ని గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవ పిళ్లై చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, హెచ్‌ఎం సుబహాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి: పట్టణంలోని కాల్వగడ్డ ఆంజనేయనేయ స్వామి క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభమవుతుందని నిర్వాహకుడు శ్రీనివాస బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు పది రోజుల పాటు టోర్నీ జరుగుతుందన్నారు.

ఎంపీపీ దంపతులకు సన్మానం



ఎంపీపీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులను అర్చకుడు హరికృష్ణ శర్మ, ధర్మకర్త రామిరెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకూ శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను ఎంపీపీ దంపతులు ఆటంకాలు లేకుండా నిర్వహించారన్నారు. అంతకుముందు ఆలయంలో చెన్నకేశవ స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఈఓ దుర్గా ప్రసాద్, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ నాగరాజు, రామ్మోహన్, కోటచౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయులు పర్యటన

బుక్కరాయసముద్రం: మండలంలోని కొండాపురంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఆధ్వర్యంలో మన ఊరికి మన వీరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ అంకే నరేష్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు కొండాపురంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. సిద్దరాంపురం, పసులూరు, పి. కొత్తపల్లి గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. అనంతరం పి. కొత్తపల్లిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలి



రాయలచెరువులోని శ్రీనివాస ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్‌ఐ ఫణీంద్రనాథ రెడ్డి

యాడికి: విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులకు బిల్లులు ఇవ్వకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని విజిలెన్స్ ఎస్‌ఐ ఫణీంద్రనాథరెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రాయలచెరువులోని శ్రీనివాస ట్రేడర్స్‌లో రికార్డులు సరిగా లేని కారణంగా రూ 1,50,000 విలువ గల ఎరువుల విక్రయం నిలుపుదల చేశారు. గ్రోమోర్ దుకాణంలో తనిఖీ చేసి, పత్తి విత్తనాలు కొలుగోలు చేసి రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఇవ్వని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఓ వాసు ప్రకాష్, వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంభూపాల్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భారత ఎన్నికల సంఘం (స్వీప్) కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంభూపాల్ ఎన్నికలు- ఓటరు ప్రాధాన్యత అంశంపై వివరించారు. అలాగే ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

తాడిపత్రి అర్బన్: 2024 ఏప్రిల్1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తాడిపత్రి నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.రాంభూపాల్‌రెడ్డి గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి హెల్ప్‌లైన్ కేంద్రాన్ని తాడిపత్రిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్ 9642338578కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

అండర్ పాస్ పనుల ప్రారంభం



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: గుత్తిలోని ఆర్ఎస్‌కు వెళ్లే రహదారి లో రైల్వే బ్రిడ్జి వద్ద అండర్ పాస్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడారు. అండర్ పాస్ పనులు ప్రారంభమైనందున ఈ రోజు నుంచి 15 రోజులు పాటు ఒక వైపు మాత్రమే రాకపోకలు సాగించాలన్నారు. ఈ విషయాన్ని పాదచారులు, వాహన చోదకులు గమనించి రైల్వే, మున్సిపల్ అధికారులకు సహకరించాలన్నారు.

మొక్కల పరిరక్షణపై సదస్సు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం మొక్కల పరిరక్షణ వ్యూహాల్లో దృక్పథం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్కేయూ ప్రొఫెసర్ బి.రవిప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణం, జీవ వైవిధ్య విలువలు, భూమి మీద జీవం, నైతిక విలువలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి, వృక్షశాస్త్రం విభాగాధిపతి శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.